క్లుప్తంగా

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఇమ్రాన్‌ను సన్మానించిన పూర్వ విద్యార్థులు

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009–10వ సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు సందడి చేశారు. కడ్తాల్ మండలం మైసిగండి ఆలయంలో మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. తమ కుటుంబ సభ్యులను పరిచయం చేస్తూ ప్రేమతో ఆప్యాయంగా ఒకరినొకరు పలుకరించుకున్నారు. ఆనాటి చిలిపి చేష్టలను, మధుర స్మృతులను స్మరించుకున్నారు.

ఇమ్రాన్‌కు ఘన సన్మానం..

మండల కో ఆప్షన్ సభ్యుడిగా పదవీ విరమణ చేసిన ఇమ్రాన్‌ను శాలువా కప్పి, పూలమాల వేసి స్నేహితులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాయితీగా పనిచేసిన ఎస్‌ఐలను మరువలేం

మాజీ ఎంపీపీ కృపేశ్



వీడ్కోలు పలుకుతున్న మాజీ ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐలుగా నిజాయితీగా పనిచేసిన మారయ్య, మైబెల్లిల సేవలను మరువలేమని మాజీ ఎంపీపీ కృపేశ్ అన్నారు. బదిలీపై వెళుతున్న ఎస్‌ఐలు మారయ్య, ఎండీ మైబెల్లిలను మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కృపేశ్ మాట్లాడుతూ సుమారు రెండేళ్లుగా ఎస్‌ఐ మారయ్య ఈ ప్రాంతానికి చేసిన సేవలను ప్రజలు ఎల్లప్పుడు గుర్తుంచుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రమేష్, భగీరథ, శ్రీకాంత్, దానయ్యతోపాటు యాచారం బీజేపీ నాయకులు రవీందర్, కాంగ్రెస్ నాయకులు నరేష్‌గౌడ్‌లు ఉన్నారు.

పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న రత్నాకర్

మంచాల: పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సేవా ఫౌండేషన్ మేనేజర్ రత్నాకర్ పేర్కొన్నారు. మంగళవారం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరుట్ల గ్రామంలోని రైతు వేదిక భవనంలో పాడి పశువుల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషక విలువలు గల పచ్చిగడ్డి, దాణా పెట్టడం ద్వారా ఆరోగ్య వంతంగా ఉంటాయన్నారు. నట్టల నివారణా, పొదుగు వాపు వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలన్నారు. బలవర్ధక పోషకాలు పెట్టడం వల్ల పాలు ఎక్కువగా ఇస్తాయన్నారు. పశువుల షెడ్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రో ల్యాబ్ మేనేజర్ శంకర్, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్, ఆదర్శ రైతు ప్రతాప్‌రెడ్డి, మార సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిఘానేత్రంపై నిర్లక్ష్యం తగదు

- పలు చోట్ల పని చేయని సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు
- కొత్తవి ఏర్పాటు చేయిస్తాం: సీఐ



కడ్తాల్ ప్రధాన రహదారి

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో ప్రజల సహకారంతో పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయడం లేదు. చోరీలు, ఇంకా ఏదైనా అనుకోని సంఘటనలు సంభవిస్తే, నేరస్తులతో పాటు అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవడంలో అవి ఉపయోగపడుతున్నాయి. మండల కేంద్రంలో 2018 సంవత్సరం నుంచి 2021 వరకు, స్థానిక వ్యాపారస్తులు, ప్రజా ప్రతినిధులు, నాయకుల సహకారంతో, పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సీసీ కెమెరాల ఏర్పాటునకు కృషి చేశారు. ఈ క్రమంలో భారీ వర్షాలతో పాటు, తరచూ రోడ్డు మరమ్మత్తుల కోసం గోతులు తీయడం వల్ల సీసీ కెమెరాల కనెక్షన్లు తెగిపోవడం, పర్యవేక్షణ కొరవడటం, తదితర సమస్యలతో అవి పని చేయకుండా పోతున్నాయి. ఇప్పటి వరకు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో 208 వరకు కమ్యూనిటీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అందులో కేవలం 16 మాత్రమే పనిచేస్తున్నాయి. కడ్తాల్ టౌన్‌లో మొత్తం 40 వరకు ఏర్పాటు చేశారు. అందులో 8 వరకు మాత్రమే పని చేస్తున్నట్లు సమాచారం. మండల పరిధిలో ×నేను సైతం₹ కెమెరాలు 200కు పైగా ఉండగా సగానికి పైగా పనిచేయడం లేవని తెలుస్తుంది. ఎన్నో రకాల నేరాలను, నేరస్తులను పసిగట్టడంలో అవి ఉపకరిస్తున్నాయి. దీంతో వాటిపై ప్రత్యేక పర్యవేక్షణ లేకపోవడం, మరమ్మత్తులపై దృష్టి సారించకపోవడం, వాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా సిబ్బంది లేక పోవడంతో సీసీ కెమెరాల పనితీరు అధ్వాన్నంగా తయారయ్యాయి. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. పోలీస్ అధికారులు సీసీ కెమెరాల మరమ్మత్తులపై దృష్టి సారించక పోవడం, చూసీ చూడనట్లుగా వ్యవహరించడం బాధాకరమని పలువురు చెబుతున్నారు. ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకొని, ప్రజా రక్షణ నిమిత్తం వెంటనే మరమ్మత్తులు చేయాలని, కొత్త వాటిని ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

నిరంతర నిఘా..

నిరంతర గస్తీ సాధ్యపడని చోట్ల ముఖ్యమైన కూడళ్లలో, ఎన్నో రకాల నేరాలను, నేరస్తుల కదలికలను, రాత్రి వేళల్లో జరిగే అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం. నేరాలు, చోరీలు జరిగినప్పుడు, ప్రమాదాలు సంభవించినప్పుడు కచ్చితమైన సమాచారం అందించడంలో సీసీ కెమెరాలకు ప్రత్యేక స్థానం ఉంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నిరంతరం నిఘా పెట్టవచ్చు. కడ్తాల్ మండల కేంద్రం మీదుగా శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి ఉంది. ఈ రహదారి మీదుగా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో ప్రమాదానికి కారణమైన వారు తప్పించుకునే ప్రయత్నం చేయొచ్చు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రధాన రహదారిపై ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో బాధ్యులు తప్పించుకునే ప్రయత్నాలు చేసినా, ప్రమాదానికి కారణమైన వాహనాలు తప్పించుకునే వీలు లేకుండా చిక్కే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో నిందితులను త్వరగా పట్టుకోవడానికి పోలీస్ అధికారులకు అవి తోడ్పడుతాయి.



పోస్టాఫీస్ కాలనీలో పనిచేయని కెమెరా



బీసీ కాలనీలో పనిచేయని సీసీ కెమెరా

మండలం అభివృద్ధిలో పరుగు..

కడ్తాల్ మండల కేంద్రంగా అవతరించడంతో అభివృద్ధిలో వేగంగా పరుగులు పెడుతుంది. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ, ఎంఈఓ, వ్యవసాయశాఖ కార్యాలయాలతో పాటు, వ్యాపార సముదాయాలు వందల సంఖ్యలో వెలిశాయి. ఇప్పటికే మండల కేంద్రంలో ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంకు, ఎస్‌బీఐ, సిండికేట్ బ్యాంకులతో పాటు, పాలశీతలీకరణ కేంద్రం, బంగారు దుకాణాలు, 7 ఏటీఎం సెంటర్లు, సినిమా హాళ్లు, మూడు పెట్రోలు బంకులు, రెండు ఇంటర్ కళాశాలలు, రెండు డిగ్రీ కళాశాలలు, అదే విధంగా వ్యాపార సముదాయాలు అనేకం ఉన్నాయి. వాటన్నింటికి సమగ్రమైన రక్షణ కల్పించాలంటే పోలీసులతో పాటు సీసీ కెమెరాలు కూడా తోడ్పడుతాయి. ఇటీవల అడపాదడపా చోరీలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో అవసరమైన చోట సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మండల కేంద్రంతో పాటు, ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తాం. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు వర్షాలకు, గాలులకు, వివిధ కారణాలతో చాలా చోట్ల పనిచేయడం లేదు. త్వరలోనే వ్యాపారస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో సమావేశమవుతాం. అందరి సహకారంతో పూర్తి స్థాయిలో తగిన చర్యలు తీసుకుంటాం. తక్షణమే పాత వాటిని మరమ్మత్తులు చేయిస్తాం. అవసరమైన చోట నూతన కెమెరాలు ఏర్పాటునకు కృషి చేస్తాం.

– శివప్రసాద్, సీఐ, కడ్తాల్

ప్రతిఒక్కరూ మొక్కలు నాటండి

ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్

ఆమనగల్లు: ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ కోరారు. ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని ఆయన సూచించారు. మంగళవారం వన మహోత్సవంలో భాగంగా మాడ్గుల రోడ్డులో ఇరువైపులా 3 కిలోమీటర్ల మేర మొక్కలు నాటే కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో వన మహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నట్లు ఆయన వివరించారు. ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. వాటిని ఇంటిముందు నాటుకుని సంరక్షించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వసంత, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు చెన్నకేశవులు, లక్ష్మణ్, కృష్ణయాదవ్, రాములు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్

ఇబ్రహీంపట్నంలో నేడు వన మహోత్సవం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం వన మహోత్స కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి తెలిపారు. గోశాల ప్రాంతంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

చిరువ్యాపారులకు కేటాయించండి

సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలో పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను చిరువ్యాపారులకు కేటాయించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నాయకులు, యువకులు, చిరువ్యాపారులతో కలిసి పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ రాధికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో రూ.46 లక్షల వ్యయంతో తెలంగాణ పాడిపారిశ్రామిక అభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్మాణం పూర్తయి రెండు సంవత్సరాలు గడిచినా నేటికి వాటిని కేటాయించకపోవడం బాధాకరమన్నారు. షాపింగ్‌కాంప్లెక్స్ భవనాలను త్వరగా ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా దుకాణ సముదాయంలో ఒక దుకాణాన్ని మహిళా సమాఖ్యకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, లాయక్‌అలీ, నర్సింహ, రాంచంద్రయ్య, నరేశ్‌యాదవ్, బుచ్చయ్య, కృష్ణయ్య, సాయిలు, కృష్ణ, మహేశ్, అంజి, సురేశ్, నర్సింహ, రాములు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, చిరువ్యాపారులు

కష్టాల్లో ఆదుకోవడమే ట్రస్ట్ లక్ష్యం

రాధాకృష్ణ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్

కడ్తాల్: కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలో ఇటీవల వివిధ అనారోగ్య సమస్యలతో మృతి చెందిన గుర్లకుంట తండాకు చెందిన రాజునాయక్, చరికొండకు చెందిన జంగయ్య, గుండాలు, గడ్డమీది తండాకు చెందిన ఇస్లావత్ దర్జీ, పెద్దవేములోని బావి తండాకు చెందిన హేమ్‌లాల్, పల్లె చెలక తండాకు చెందిన ఇస్లావత్ మంగ్యా తదితర మృతుల కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ మండల పరిధిలోని ఏ కుటుంబానికి ఆపద వచ్చిన రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, నాయకులు భూనాథ్, జంగయ్య, రమేశ్, దర్గయ్య, కృష్ణయ్య, భూపాల్, చెన్నయ్య, బీచ్యా, బీమ్లా, రవి, అంజయ్య, ముత్యాలు, శ్రీను, రవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: ఆర్థిక సాయం చేస్తున్న దశరథ్‌నాయక్

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ప్రతిభ గల పేద విద్యార్థులకు చేయూతనందిస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన మల్లేష్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని భార్య మంజుల అనేక ఇబ్బందులకు గురవుతోందని, పోషణ భారం బరువై కూతురు శ్రావ్యను చదివించలేక పోతుంది. ఈ విషయాన్ని కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం కన్వీనర్ మొక్కురాల అశోక్‌గౌడ్ వెంకటేష్ దృష్టికి తీసుకెళ్ళాడు. తక్షణమే స్పందించిన ఆయన శ్రావ్యను చదివిస్తానని భరోసా ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో ట్రస్టు సభ్యులచే రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్కూల్ యజమాన్యంతో మాట్లాడి చదివిస్తానని వెంకటేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రామస్వామి, మల్లేష్, అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తుర్కయంజాల్: వార్డు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని 19వ వార్డు కౌన్సిలర్ నారని కవిత తెలిపారు. మంగళవారం ఆమె సుభాష్ నగర్, ఈస్ట్ సూరజ్ నగర్ కాలనీలలో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నాణ్యతతో పనులను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నారని శేఖర్ గౌడ్, దాసరి సుధాకర్ రెడ్డి, వెంకటేష్ చారి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు



నవరాత్రి పూజలో భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయస్వామి దేవాలయంలో శ్రీ వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకాలంకరణలో ఉంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ పూజారులు నాగభూషణ స్వామి, శరత్చంద్రల ఆధ్వర్యంలో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, స్థానికులు రవీంద్రుడు పాల్గొన్నారు.

టీయూఎఫ్ఐడీసీ చైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ



చల్లా నర్సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అరుణ్‌కుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: టీయూఎఫ్ఐడీసీ చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని కాంగ్రెస్ జిల్లా నాయకులు బోసుపల్లి అరుణ్ కుమార్ మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి సత్కరించారు. నూతన చైర్మన్‌గా నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలిపారు.

మల్‌రెడ్డి రాంరెడ్డికి అభినందనల వెల్లువ



మల్‌రెడ్డి రాంరెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఇంద్రసేనారెడ్డి



హరిచందన దాసరిని మర్యాదపూర్వకంగా కలిసిన మల్‌రెడ్డి రాంరెడ్డి

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మల్‌రెడ్డి రాంరెడ్డికి పలువురు నాయకులు, అధికారుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ రాజ్ ఇంజనీర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల రాజశేఖర్‌తోపాటు ఎన్ను గోవర్ధన్‌రెడ్డి, దారు రాఘవేందర్‌రావుతోపాటు ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు మంగళవారం మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసి శాలువ కప్పి అభినందనలు తెలిపారు.

తుర్కయంజాల్: రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మల్‌రెడ్డి రాంరెడ్డిని మున్సిపాలిటీకి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య, కౌన్సిలర్లు కంబాలపల్లి ధన్‌రాజ్, బాలరాజు, బొక్క రవీందర్ రెడ్డి, నాయకులు కుంట గోపాల్ రెడ్డి, దాసరి సుధాకర్ రెడ్డి, మేతరి దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ సెక్రటరీని కలిసిన మల్‌రెడ్డి రాంరెడ్డి

ఇబ్రహీంపట్నం: నూతనంగా రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన మల్‌రెడ్డి రాంరెడ్డి ఆర్‌అండ్‌బీ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ హరిచందన దాసరిని సెక్రటేరియట్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రాంరెడ్డికి ఆమె అభినందనలు తెలిపారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



ఇబ్రహీంపట్నం: జెండావిష్కరణలో ఏబీవీపీ నాయకులు



యాచారం: మాల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ శ్రేణులు



ఆమనగల్లులో ఏబీవీపీ పతాకాన్ని ఆవిష్కరించిన శివ

ఇబ్రహీంపట్నం: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో జెండావిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ జాతీయ సమైక్యత కోసం, విద్యార్థుల సమస్యల పరిష్కరించడానికి సంఘం ఎంతో కృషిచేస్తుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వంగ సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు జగదీశ్, నగర కార్యదర్శి మహేందర్‌తోపాటు అశ్వంత్, నాని, అజేయ్, ఆదిత్య, శశిధర్‌రెడ్డి, సాయితేజ, సందీప్, సాయిలు పాల్గొన్నారు.

ఆమనగల్లు: పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద ఏబీవీపీ జెండాను విద్యార్థులతో కలిసి పట్టణ కార్యదర్శి శివ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏబీవీపీ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం అని, అనేక ఉద్యమాలు చేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరటి భరత్, మల్లేశ్, సురేశ్, నరేశ్, అంజి, సుమన్, శివాచారి, సాయి, శివ, అజయ్, ఎర్రవోలు మహేశ్, శ్రీను, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల: మాడ్గుల మండల కేంద్రంలో ఏబీవీపీ పతాకాన్ని మండల కన్వీనర్ కార్తీక్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌గౌడ్, పవన్‌గౌడ్, ఉదయ్‌కిరణ్, మణికంఠ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

యాచారం: మాల్, యాచారం కేంద్రాల్లో ఏబీవీపీ శ్రేణులు ర్యాలీలు నిర్వహించారు. విద్యార్థి సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తు 75 ఏళ్లుగా ఏబీవీపీ ఎంతో గుర్తింపు పొందిందని అన్నారు. నరేందర్‌గౌడ్, పృథ్విరాజ్, దొంతగోని కృష్ణ, సందీప్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్: విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాడుతుందని సీనియర్ నాయకుడు బొల్గం మురళీ పేర్కొన్నారు. ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్గం మురళీ మాట్లాడుతూ ఏబీవీపీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యలపై నిరంతరం, విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, మహేశ్, దశరథ్, వంశీ, నందీశ్వర్, సిద్ధార్థ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణప్రసాద్ అరెస్టును ఖండిస్తూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు: భద్రాచలంలో న్యాయవాది కృష్ణప్రసాద్ అరెస్టు విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరును ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. పోలీసుల తీరును నిరసిస్తూ ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపల్లి జగన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర కీలకమని, ప్రజల హక్కులను కాపాడటం కోసం, ప్రజల తరపున నిత్యం పోరాడే వ్యక్తులు న్యాయవాదులు అని అన్నారు. న్యాయవాదుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ప్రతిఒక్కరూ ఖండించాలని ఆయన కోరారు. న్యాయవాది కృష్ణప్రసాద్ చేతులకు బేడీలు వేసి కోర్టుకు తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. న్యాయవాది కృష్ణప్రసాద్ పట్ల అమానుషంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి మధు, న్యాయవాదులు శేఖర్, మల్లేశ్, జగన్‌గౌడ్, గణేశ్‌గౌడ్, శ్రీనివాస్, సత్యనారాయణ, ఆంజనేయులు, సర్దార్, శేఖర్ పాల్గొన్నారు.